## వేతనాల కోసం ఆర్టీసీలో పడిగాపులు

- పూర్తిగా విడుదల కాని 'మహాలక్ష్మి' బకాయిలు
- జోన్ల వారీగా వేతనాలు!

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. 'ఈ నెల జీతం ఇవ్వండి మహాప్రభో' అంటూ ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగానే వారు కూడా వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఆర్టీసీకి బాగా లాభాలు వచ్చాయని అటు ప్రభుత్వం, ఇటు సంస్థ యాజమాన్యం చెప్తున్నప్పటికీ ఉద్యోగులకు మాత్రం ప్రతి నెలా 1న వేతనాలు ఇవ్వడం లేదు. నిజంగానే ఆర్టీసీకి లాభాలు వస్తే సకాలంలో జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని, కెనరా, యూనియన్ బ్యాంకులతో చేసుకున్న ఒప్పందం ఏమైందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

### అందరికీ ఒకేసారి ఇవ్వలేక..

ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవటంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించటం ఆర్టీసీకి కష్టంగా మారింది. దీంతో అందరికీ ఒకేసారి జీతాలు చెల్లించలేక ఉన్న డబ్బులతో జోన్లు, జిల్లాల వారీగా వేతనాలు విడుదల చేస్తున్నట్టు తెలిసింది. అలా 4వ తేదీ సాయంత్రం వరకు కొందరు డ్రైవర్లు, కండక్టర్లకు మాత్రమే జీతాలిచ్చింది. ఆర్టీసీలో అతి తక్కువ జీతాలుండే శ్రామిక్, మెకానిక్, భద్రతా సిబ్బందికి జీతాలు అందక వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

# ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీలో కోత!

**వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో**

- దళిత, గిరిజనులకు సర్కారు ధోకా
- పనిముట్ల రాయితీలో భారీగా కోత
- బీఆర్ఎస్ హయాంలో 90 % సబ్సిడీ
- కాంగ్రెస్ సర్కారు ఇస్తున్నది 50%

**నియోజకవర్గానికో ట్రాక్టర్.. మండలానికో రోటవేటర్ మాత్రమే**

- దళిత, గిరిజన రైతులపై ఆర్థిక భారం
- దరఖాస్తులు కుదించేందుకు పన్నాగం
- మహిళా రైతులకే పథకం అమలు
- బీఆర్ఎస్ హయాంలో 14 వేల ట్రాకర్లు
- పథకం అమలుపై రైతుల అసంతృప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఎస్సీల జపం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు.. తెరవెనుక వారికి ఎగనామం పెడుతున్నది. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీలో భారీగా కోత పెట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పరికరాల కొనుగోలులో 90 శాతం సబ్సిడీ ఇవ్వగా.. దీన్ని కాంగ్రెస్ సర్కారు 50 శాతానికి తగ్గించింది. తద్వారా దళిత, గిరిజన రైతులపై ప్రభుత్వం ఆర్థిక భారం మోపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు గానూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు ప్రణాళికలు రచించింది. ఇందుకోసం ఇప్పటికే రూ.24.90 కోట్లు కేటాయించింది. ఇప్పటికే టెండర్లు పూర్తయి, ధరలను కూడా నిర్ణయించింది. ప్రస్తుతం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నది.

### నాడు 90 శాతం.. నేడు 50 శాతమే

కేంద్ర ప్రభుత్వ పథకమైన సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్(స్మామ్)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని అమలు చేస్తున్నది. దీంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనలే ఈ పథకానికి అమలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ ఉంటుంది. ఆ నిబంధనలనే రాష్ట్ర సర్కారు ఇప్పుడు అమలు చేస్తున్నది. వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సొంతంగానే 2018లో పెద్ద ఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసింది. ఎస్సీ, ఎస్టీలకు పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందించగా.. ఇతరులకు 50 శాతం రాయితీపై అందించింది. కానీ, కాంగ్రెస్ సర్కారు 40 శాతం కోత పెట్టడంతో ఆయా వర్గాల రైతులపై భారీగా ఆర్థిక భారం పడనుంది. కేంద్రంతో సంబంధం లేకుండా ఈ అదనపు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరించవచ్చు. కానీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



### ఇచ్చినవే తీసుకోవాలి

2018లో బీఆర్ఎస్ అమలు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో అధిక సబ్సిడీ ఇవ్వడమే కాదు.. రైతులకు అవసరమైన కోరుకున్న పరికరాలను సరఫరా చేసింది. కానీ, కాంగ్రెస్ సర్కారు 'ఏవీ లేవు.. ఉన్నవి తీసుకెళ్లండి' అనే విధంగా సరఫరా చేస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు ఎక్కువగా అవసరమయ్యే పరికరాలను కాకుండా ఇతర పరికరాలను జాబితాలో పొందుపరిచినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వం సొంతంగా వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ.951.28 కోట్లు ఖర్చు చేయగా కాంగ్రెస్ సర్కారు కేంద్ర ప్రభుత్వంతో కలిసి రూ.24.90 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుండటం గమనార్హం. బీఆర్ఎస్ సర్కారు సుమారు 14 వేల ట్రాక్టర్ల ను పంపిణీ చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్‌కు ఒకటి చొప్పున 600 ట్రాక్టర్లను మాత్రమే ఇస్తున్నది. ఇక మండలానికో రోటవేటర్‌ను ఇస్తున్నది.నాడు బీఆర్ఎస్ 14 వేల ట్రాక్టర్లు, 31 వేల ఇతర పరికరాలు, 26 వేల స్ప్రేయర్లను పంపిణీ చేసింది. ఇప్పుడు పరికరాల సంఖ్యపై పరిమితి పెట్టడంపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది.

### మహిళల పేరిట మరో కుటిల పన్నాగం

రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులున్నారు. దీంతో అందరికీ పరికరాలు ఇవ్వలేక కాంగ్రెస్ సరాకరు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే ఈ పథకాన్ని మహిళా రైతులకు మాత్రమే అమలు చేస్తున్నట్టు చెబుతున్నది. తద్వారా తక్కువ దరఖాస్తులు వస్తాయని పన్నాగం పన్నినట్టు తెలిసింది.

| | |
|---|---|
| బీఆర్ఎస్ హయాంలో కేటాయింపులు | రూ.951.28 కోట్లు |
| కాంగ్రెస్ సర్కారు కేటాయింపులు | రూ.24.90 |
| బీఆర్ఎస్ పంపిణీ చేసిన పరికరాలు... | |
| ట్రాక్టర్లు | 14 వేలు |
| స్ప్రేయర్లు | 26 వేలు |
| ఇతర పరికరాలు | 31 వేలు |

| | |
|---|---|
| ఎస్సీ, ఎస్టీలకు బీఆర్ఎస్ ఇచ్చిన సబ్సిడీ | 90 శాతం |
| కాంగ్రెస్ ఇస్తున్న సబ్సిడీ (అది కూడా కేంద్రప్రభుత్వ నిధుల సాయంతో) | 50 శాతం |
| రైతులపై పడే ఆర్థిక భారం | 40 శాతం |
| కాంగ్రెస్ సర్కారు ఇస్తున్న పరికరాలు | |
| ట్రాక్టర్లు | 600 |
| రోటవేటర్లు | మండలానికి ఒకటి |



పోలీసు పహారా మధ్య మేడిపల్లిలో కంచెవేస్తున్న అధికారులు..

## ఆందోళన చేస్తున్నా... ఆగని ఫార్మా పనులు

పోలీసు పహారా మధ్య కంచె వేస్తున్న అధికారులు

రంగారెడ్డి, ఏప్రిల్ 4 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డిజిల్లా యాచారం మండలంలోని ఫార్మా భూముల రీసర్వే ఆందోళనల మధ్య కొనసాగుతున్నది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను రీసర్వే చేసి కంచె వేయటానికి రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం మేడిపల్లిలో పనులు ప్రారంభించగా రైతులు అడ్డుకున్నారు. రైతులను వారికి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టుచేసి యథావిధిగా కంచె పనులు చేపట్టారు. శుక్రవారం నాలుగు బృందాలు ఓవైపు సర్వే చేస్తుండగానే మరోవైపు కంచె వేసే పనులు చేపడుతున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బృందాలను మోహరించారు. పోలీసు పహారా మధ్య మేడిపల్లిలో రెండోరోజు కంచెవేసే పనులు కొనసాగుతున్నాయి. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 121 గజాల ఇంటిస్థలం, ఇంటికో ఉద్యోగాన్ని ఇస్తామని చెప్పిన ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పుడు వాటి ఊసెత్తటంలేదు. దీంతో రీసర్వేను రైతులు అడ్డుకుని, తమ సమస్య పరిష్కరించాలని అధికారులను నిలదీశారు.

### మొండిగౌరెల్లి ఉదంతం మరువక ముందే ఫార్మా రీసర్వే..

యాచారం మండలంలోని మొండిగౌరెల్లిలో ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు పేరుతో 821ఎకరాలను తీసుకోవాలనే ఉదేశ్యంతో నోటిఫికేషన్ జారీచేసింది. తమ భూములు తీసుకోవద్దంటూ మొండిగౌరెల్లి రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఉదంతం కొనసాగుతుండగానే మరోవైపు ఫార్మాసిటీ భూముల రీసర్వే కంచె వేసే పనులు మొదలయ్యాయి. దీంతో యాచారం మండలం హాట్ టాపిక్‌గా మారింది. ఫార్మా బాధిత గ్రామాలు నాలుగు ఉండగా....ముందుగా మేడిపల్లిలో రీసర్వే పనులను చేపట్టారు. నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో రీసర్వే ప్రారంభించాల్సి ఉంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ ఫార్మా రైతులకు బాసటగా నిలుస్తామని ప్రకటించారు.



ఖమ్మం జిల్లా మధిర ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా సక్సెస్

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరసన

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో దశాబ్దాలపాటు పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు శుక్రవారం డిపోల ముందు చేపట్టిన ధర్నా విజయవంతమైంది. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా వేల మంది కార్మికులు ధర్నాకు దిగారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్ వద్ద జరిగిన ధర్నాలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ప్రచార కార్యదర్శి పీఆర్ రెడ్డి, కార్యదర్శి జీఆర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏవీ రావు మాట్లాడుతూ.. 2017 పీఆర్సీ బకాయిలను చెల్లించాలని, 2022 నుంచి రావల్సిన టెర్మినల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగులతోపాటు, వారి జీవిత భాగస్వాములు ఉచితంగా సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు రిటైర్డ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మహబూబ్‌నగర్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, వరంగల్ రీజియన్‌లో ఎల్లయ్య, సీహెచ్. రాంచందర్, ఆదిలాబాద్‌లో ఉపాధ్యక్షుడు ఎంబీ రావు, కరీంనగర్‌లో మల్లయ్య, శ్రీనివాస్, ఖమ్మంలో రీజియన్ కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ రావు తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు. అనంతరం ప్రధాన ఆఫీసుల్లో ఆర్టీసీ ఎండీ, ఓఎస్డీ భాను ప్రసాద్‌తోపాటు అన్ని డిపో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు.



కాసిపేటలో కలెక్టర్, ఎమ్మెల్యే కాళ్లు మొక్కుతున్న మహిళ, కుర్చీలో తన భర్త

## బాంచెన్ జర ఆదుకోండి

బెల్లంపల్లి ఎమ్మెల్యే కాళ్లు మొక్కి వేడుకున్న మహిళ

కాసిపేట, ఏప్రిల్ 4 : 'నా భర్త అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యిండు. ఆపరేషన్ చేయిస్తే పరిస్థితి మరింత వికటించి, మొత్తం లేవకుండా అయ్యిండు. బాంచెన్ జర పింఛన్ ఇప్పించి ఆదుకోండి' అంటూ మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్కెపల్లికి చెందిన మాసు పద్మ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాళ్లుమొక్కి వేడుకున్నది. శుక్రవారం కాసిపేటలో మెగా వైద్య శిబిరానికి కలెక్టర్, ఎమ్మెల్యే హాజరయ్యారు. అదే సమయంలో అనారోగ్యంతో కుర్చీకే పరిమితమైన తన భర్త చిన్నయ్యతో అక్కడికి చేరుకున్నది. రిపోర్టులు చూపి ఆదుకోవాలని విలపించింది.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

## ఉపాధి పని కోసం రోడ్డెక్కిన కూలీలు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాస్తారోకో
- డీఆర్‌డీవో అధికారులకు వినతి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పలు గ్రామాలకు చెందిన 701 మంది కూలీలు రాస్తారోకో నిర్వహించారు. మున్సిపాలిటీ ఉపాధిహామీ కూలీల సంఘం అధ్యక్షురాలు గరిగెల పద్మ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆసిఫాబాద్, గొడవెల్లి, జనకాపూర్, హీరాపూర్, తారకరామనగర్‌కు చెందిన 460 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, వీరందరికీ ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పాలనలో వలసబాట!

- ఖాళీ అవుతున్న గోదావరి తీర గ్రామం బెస్తపల్లి
- బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరంతో నిండుగా జలాలు
- చేపల వేటతో తీర గ్రామాల మత్స్యకారులకు ఉపాధి
- నాలుగేండ్లు రంది లేకుండా కుటుంబాలతో కలిసి జీవనం
- కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో అంతా అయోమయం
- గోదావరి ఎడారిలా మారడంతో దెబ్బ తిన్న ఉపాధి అవకాశాలు
- మళ్లీ బొంబాయి, దుబాయి, హైదరాబాద్‌కు పయనం

పెద్దపల్లి, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)/ మంథని రూరల్ : ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు, కన్నీళ్లు మళ్లీ పునరావృతమవుతున్నాయి. స్వరాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడి వలసలు వాపస్ వచ్చినా.. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే మళ్లీ వలస బాట పట్టాల్సిన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి లేక, కుటుంబాలను సాకలేక పల్లెలు బతుకుబాట పడుతున్నాయి. అందుకు పెద్దపల్లి జిల్లాలోని గోదావరి తీర గ్రామాలే నిదర్శనం. స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి గోదావరిని నిండుకుండలా మార్చడంతో చేపల పెంపకంతో మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. దాంతో ఉమ్మడి రాష్ట్రంలో వలస పోయిన వారంతా తిరిగి స్వగ్రామాలకు చేరుకున్నారు. గోదావరి తీర గ్రామాల వాసులు బ్యారేజీల వద్ద చేపల వేట కొనసాగిస్తూ ఉన్న ఊరిలోనే కుటుంబాలతో సంతోషంగా గడిపారు. కానీ, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో మళ్లీ పరిస్థితులు తారుమారయ్యాయి. కేసీఆర్‌పై కోపంతో బ్యారేజీ గేట్లను ఎత్తి నీళ్లను వదలడంతో గోదావరి ఎడారిలా మారింది. సమీప గ్రామాల్లో ఉపాధి దెబ్బతిన్నది. దీంతో తిరిగి బొంబాయి, దుబాయి, హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు.

### ఖాళీ అవుతున్న బెస్తపల్లి..

మంథని మండలం బెస్తపల్లిని ఆనుకొని గోదావరి తీరం ఉంటుంది. ఈ గ్రామంలో 300 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ అందరూ మత్స్యకారులే. ఉమ్మడి రాష్ట్రంలో ఈ గ్రామం నుంచి ఎంతో మంది ఉపాధి కోసం బొంబాయి, దుబాయికి వలస వెళ్లారు. వీరంతా స్వరాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తిరిగి స్వగ్రామానికి వచ్చి చేపల వేట కొనసాగిస్తూ ఉన్న ఊరిలోనే ఆనందంగా జీవించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం నీటిని కిందికి వదలడంతో ఇక్కడి మత్స్యకారుల నోట్లో మట్టి కొట్టినట్టయ్యింది. గోదావరిలో నీళ్లు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. తిరిగి వలసబాట పట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించుకోలేక వలస వెళ్తున్నారు. ఇప్పటికే గ్రామం నుంచి 60 మంది వరకు వెళ్లగా, మరికొంత మంది వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు భార్యాపిల్లలను వదిలి వెళ్తే, మరికొందరు కుటుంబాలతో కలిసివెళ్లారు.

### మళ్లీ బొంబాయి బాట..



ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతులు కూనారపు స్వప్న-వెంకటేశం. వీరిది బెస్తపల్లి గ్రామం. గతంలో గోదావరి నది ఎండిపోవడంతో ఉపాధి దొరక్క వీరు స్వగ్రామాన్ని వదిలి బొంబాయికి వెళ్లి అక్కడ బతికారు. స్వరాష్ట్రంలో గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిరిపురం బ్యారేజీని నిర్మించారు. దీంతో గోదావరి జీవం పోసుకొని నిండుగా మారింది. చేపల పెంపకంతో ఉన్న ఊరిలోనే సంతోషంగా బతకవచ్చని భావించి 2019 చివరలో తిరిగి స్వగ్రామానికి వచ్చారు. అప్పటి నుంచి వెంకటేశం సుందిళ్ల బ్యారేజీ వద్ద చేపలు పట్టి ఉపాధి పొందాడు. రోజుకు దాదాపుగా రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు సంపాదించాడు. అంతా సంతోషంగా గడిచిపోతున్న సమయంలో మళ్లీ గడ్డు పరిస్థితి ఎదురైంది. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లను కిందకి వదిలింది. దీంతో వారి కుటుంబంపై పిడుగుపడినట్టయింది. ఏడాదిన్నరగా గోదావరి ఎండిపోయి చేపలు పట్టే పరిస్థితి లేకపోయింది. దీంతో ఆ కుటుంబం పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. దీంతో వెంకటేశం మళ్లీ వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్న ఊరును, భార్యాపిల్లలను వదిలి బొంబాయి వెళ్లాడు. అక్కడ డ్రైవర్‌గా, బౌన్సర్‌గా పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయనను 'నమస్తే తెలంగాణ' పలుకరించగా.. తన ఆవేదనను వెల్లగక్కాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరిని ఎండబెట్టి మా పొట్ట కొట్టిందని వాపోయాడు. ప్రభుత్వం తమను గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలని వేడుకుంటున్నాడు.


### పిల్లల చదువులు భారమై దుబాయి పోయిండు



మా ఊళ్లె ఏ పని దొరక్క ఎన్కటి నుంచి మా ఆయన తిమ్మయ్య దుబాయి మస్కట్‌ల పనిచేసేది. కాళేశ్వరం నీళ్లచ్చినంక పానం చల్లబడ్డది. ఇక్కడనే బతుకొచ్చు అని మా ఆయన దుబాయి నుంచి వచ్చిండు. చాపలు పట్టి బతికెటోళ్లం. రోజుకు రూ.వెయ్యి నుంచి 2 వేల దాకా వచ్చేది. నాలుగేండ్లు సంతోషంగా గడిచింది. ఇప్పుడు నీళ్లు వదిలిపెట్టి మాకు కన్నీళ్లు మిగిల్చిన్రు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి బీటెక్, చిన్నమ్మాయి 8వ తరగతి చదువుతున్నది. కుటుంబానికి, పిల్లల చదువులకు ఎల్లట్లేదు. ఇక్కడ పని కరువై మళ్లీ మా ఆయన దుబాయికి పోయిండు.


**– అరిపెల్లి లక్ష్మి, వలసబాధితుడు తిమ్మయ్య భార్య, బెస్తపల్లి**

### ఉపాధి కరువై బతుకు భారం..




ఈ ఫొటోలో కనిపిస్తున్నది కూనారపు లింగమ్మ. ఆమెది బెస్తపల్లి గ్రామం. ఊళ్లో ఉపాధి దొరకక ఆమె, ఆమె భర్త ఎల్లయ్య బొంబాయి కి వెళ్లి బతికేది. అక్కడ భార్యాభర్తలిద్దరూ చెరోపని చేసుకునేది. అలా వీరు కూడా వెళ్లి అక్కడ బతికారు. కొన్నేండ్ల తర్వాత వాళ్లు తిరిగి స్వగ్రామానికి వచ్చారు. ఆ తర్వాత వారి ముగ్గురు కొడుకులు సైతం పెరిగి పెద్దయ్యాక వాళ్లకూ ఉపాధి దొరక్క బొంబాయికి వెళ్లడంతో తల్లి లింగమ్మ మాత్రం ఇంటి వద్ద ఉండేది. ఈ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంతో గోదావరి నిండుకుండలా మారింది. ముగ్గురు కొడుకులు తిరిగి బెస్తపల్లికి చేరుకున్నారు. చేపలు పడుతూ సంతోషంగా జీవనం సాగించారు. ముగ్గురు కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో లింగమ్మ కూడా ఆనందంగా గడిపింది. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సుందిళ్ల గేట్లను ఎత్తి నీళ్లను కిందికి వదలడంతో ఉపాధి కరువై బతుకు భారమైంది. దీంతో ఇంటి పట్టున ఉండాల్సిన ముగ్గురు కొడుకుల్లో ఇద్దరు కొడుకులు మళ్లీ బొంబాయికి వెళ్లారు.

### నాలుగేండ్లకే తాళం



ఈ ఫొటోలో కనిపిస్తున్నది బోరె మల్లేశ్ ఇల్లు. ఎంతో ప్రేమతో ఈ బిల్డింగ్ కట్టుకున్నాడు. కానీ, నాలుగేండ్లు కూడా అందులో ఉండని పరిస్థితి. తెలంగాణ రాక ముందు బొంబాయికి వలసపోయిన ఆయన, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తర్వాత స్వగ్రామం బెస్తపల్లికి వచ్చాడు. చేపల వేటతో ఉపాధి పొందాడు. సొంతంగా ఇల్లు కూడా కట్టుకున్నాడు. అందులోనే సంతోషంగా జీవించాడు. కానీ, ఇప్పుడు గోదావరి నీళ్లు లేక ఎడారిలా మారడంతో ఉపాధి దెబ్బతిన్నది. ఈ పరిస్థితుల్లో ప్రేమతో కట్టుకున్న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా బొంబాయి వెళ్లిపోయాడు.


### మళ్లీ వలస పోయిండు..



మా ఆయన లక్ష్మణ్ బొంబాయిల ఉండేది. అక్కడ పనిచేసి జీతం పంపేది. నేను ఇక్కడ పిల్లలను చదివించుకుంట ఉండేది. నేను కూలికి పోయేది. కానీ, కాళేశ్వరం నీళ్లు అచ్చినంక మా ఆయన ఊరికచ్చిండు. ఇక్కడ్నే ఆయన చాపలకు పోతే, నేను కూలికి పోయేది. పిల్లలతోటి సంతోషంగా ఉండేది. గంగల నీళ్లు ఎత్తినంక ఇక్కడ మాకు రూపాయి దొరక్కుంట అయ్యింది. పెద్ద కష్టం వచ్చి పడ్డది. ఇగ తప్పదని మళ్లీ నా భర్త బొంబాయికి పోయిండు. పిల్లలు ఒకరు 8, ఇంకొకరు 6 చదువుతున్నరు. మేమిక్కడ, ఆయన అక్కడ.. ఒక్కోసారి చానా బాధైతది. డ్యామ్‌ల నీళ్లు నింపాలె. మళ్లీ మేము చాపలు పట్టుకునేటట్టు చెయ్యాలె.

**–తోకల విజయ, బెస్తపల్లి**

### డ్రైవర్‌గా పనిచేస్తున్నడు



నాలుగేండ్లు మాకు ఏ కష్టం రాలేదు. మా ఆయన ఇంటికాడ చాపలు పట్టుకుంట ఉంటే నేను, నా ఇద్దరు పిల్లలం సంతోషంగా బతికేది. కానీ, గంగల నీళ్లుపోయినంక మాకు కష్టాలు వచ్చినై. ఏ పని దొరకలేదు. ఏం చెయ్యాల్నో తెల్వక మా ఆయన ధర్మాజి సంపత్ బొంబాయికి పోయిండు. అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తున్నడు. ఇక్కడ నేను ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి బతుకుతున్నా.

**– ధర్మాజి మౌనిక, బెస్తపల్లి**

## సమ్మె బాటలో ఆర్టీసీ

- 7న సన్నాహక సమావేశం
- ఆ రోజే సమ్మె తేదీ ప్రకటన?
- ఎన్నికల కోడ్ పేరిట సమ్మె నిర్వీర్యానికి కుట్ర
- ఈసీని కలిసిన ఆర్టీసీ జేఏసీ
- సమ్మె జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత
- 'నమస్తే తెలంగాణ'తో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో సమ్మె హారన్ మోగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సమ్మెకు వెనుకాడేది లేదని ఆర్టీసీ యూనియన్లు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఈ మేరకు ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి, లేబర్ కమిషనర్‌కు నోటీసులు ఇచ్చాయి. అయినప్పటికీ కార్మికులను చర్చలకు ఆహ్వానించకుండా ఆర్టీసీ యాజమాన్యం తాత్సారం చేస్తున్నది. దీంతో యూనియన్లు ఈ నెల 7న సమ్మెకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించనున్నాయి. ఈ లోగా ప్రభుత్వం స్పందించకపోతే అదే రోజు సమ్మె తేదీని ప్రకటిస్తామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న (ఈయూ), జేఏసీ వైస్ చైర్మన్ మారంరెడ్డి థామస్‌రెడ్డి (టీఎంయూ) 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. ఆర్టీసీ కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ బకాయిలు, కారుణ్య నియామకాలపై యాజమాన్యం తప్పనిసరిగా చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

### చర్చలకు యాజమాన్యం డుమ్మా

సమస్యల పరిష్కారం కోసం జనవరి 27న సమ్మె నోటీసు ఇచ్చామని, దీనిపై ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడం దారుణమని ఈయూ, టీఎంయూ నాయకులు తెలిపారు. ఇటీవల లేబర్ కమిషనర్ ఇరు వర్గాలను రెండుసార్లు చర్చలకు ఆహ్వానించినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం రాలేదని పేర్కొంటూ.. దీని వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మూడోసారి నోటీసులు ఇచ్చేందుకు లేబర్ కమిషనర్ సుముఖత వ్యక్తం చేయడం లేదని, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం ఎన్నికల సంఘం అధికారులను కలువగా 'ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నోటీసుకు, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని, నిరభ్యంతరంగా చర్చలు జరుపుకోవచ్చని స్పష్టం చేయడంతో 7న సన్నాహక సమావేశం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం ఒకవేళ సమ్మె జరిగితే అందుకు పూర్తిగా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు అన్ని యూనియన్లతోపాటు మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు కూడా కలిసిరావాలని కోరారు.

### ఆర్టీసీ సిబ్బందిపై అధిక పనిభారం

ఆర్టీసీలో గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 16 వేల మంది కార్మికులు రిటైర్ అయినప్పటికీ కొత్త నియామకాలు చేపట్టలేదని, ఆ పని భారమంతా ప్రస్తుతం ఉన్న కార్మికులపైనే పడుతున్నదని ఈయూ, టీఎంయూ నాయకులు ధ్వజమెత్తారు. దీంతో రోజుకు 14 నుంచి 16 గంటలపాటు పనిచేయాల్సి వస్తున్నదని, అధిక పని భారాన్ని తట్టుకోలేక ఏటా సుమారు 200 మంది కార్మికులు అకాల మరణం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 వేతన సవరణకు సంబంధించిన అలవెన్సులను ఇప్పటివరకు పెంచలేదని, వాటిని ఉద్యోగ విరమణ సమయంలో చెల్లిస్తామని చెప్పడం సమంజసం కాదని పేర్కొన్నారు. వేతన బకాయిలను లెక్కగట్టి, ఆ వివరాలను ప్రతి కార్మికునికి తెలియజేయాలని, గతంలో ఇచ్చినట్టు 5 ఏండ్ల కాలపరిమితికి వడ్డీతో సహా చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించనప్పుడు వారితో సమానంగా హెచ్‌ఆర్‌ఏ ఎలా కట్ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేసేందుకు వెంటనే అపాయింట్‌మెంట్ డేను ప్రకటించాలని, 'మహాలక్ష్మి' పథకం కింద ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు.

## విద్యుత్తుషాక్‌తో వేద పాఠశాల విద్యార్థి మృతి

- బాసరలోని గోదావరి ఘాట్ వద్ద ఘటన

బాసర, ఏప్రిల్ 4 : బాసర వేద విద్యాలయ పీఠంలో వరుస ఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఇటీవల తుప్రాన్‌కు చెందిన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో దాడికి గురవగా, శుక్రవారం మరో విద్యార్థి కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ(17) వేద పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. శుక్రవారం బాసర సరస్వతీ ఆలయం సమీపంలోని గోదావరి ఘాట్ వద్ద పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే గంగాహారతి స్థల ఏర్పాట్ల కోసం బోర్ మోటర్ స్టార్ట్ చేస్తుండగా విద్యుత్తుషాక్ తగిలి అక్కడే పడిపోయాడు. వెంటనే సిబ్బంది బాసరలోని పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్, సీఐ మల్లేశ్, ఎస్ఐ గణేశ్ పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. గత నెలలో పాఠశాల మరో విద్యార్థి తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.